# 8. అది చూపు, ఇది నడక!

శనివారం-

ఉదయం పదిగంటలయింది.

హాస్పటల్ వాతావరణం జడివాన కురుస్తుంటే మధ్యలో బావురు కప్పల అరుపుల్లా ఒకటే రొదగా వుంది.

రూమ్‌లో - బెడ్‌మీద కృష్ణమూర్తి. చేతులు రెండూ గుండెలమీద పెట్టుకుని నిర్లిప్తంగా సీలింగ్‌కేసి చూస్తూ పడుకుని వున్నాడు. ఒక చేతికి డ్రిప్‌పెట్టి తొలగించిన అవశేషాలున్నై. మళ్లీ పెట్టాల్సివస్తే, నరం దొరక్క అక్కడా ఇక్కడా పీకీలాగీ గుచ్చి గుచ్చి పేషంట్‌ని అవస్థ పెట్టకుండా చేసిన ఏర్పాటు అది! తొడపాశం పెట్టి పప్పుండ చేతికిచ్చినట్టుంది సౌకర్యం!

అప్పుడే కృష్ణమూర్తిని చూసి వెళ్ళారు - గురురాజన్. వాళ్ళిద్దరూ పూర్వం ఎప్పుడో ఈయనతో కలిసి చెన్నైలో పని చేశారట. వెళ్తూ గురురాజన్ అన్నమాటలే గోపాల్‌కి చెవుల్లో మోగుతున్నై. ఆయనన్నాడు, 'ఇవ్వాళా రేపూ తొందరపడి కార్పొరేట్ హాస్పటల్స్‌లో చేరకూడదు మూర్తిగారూ!' అని.

గోపాల్ కృష్ణమూర్తి పెద్ద కొడుకు. ఇప్పుడు బెడ్ పక్కగా స్టూల్ మీద కూచుని ఆలోచిస్తూ, దిక్కులు చూస్తున్నాడు. తల్లి రామలక్ష్మి అంటెండెంట్ బెడ్ మీద కూచుని భర్తకేసీ, గోపాల్‌కేసీ చూపులు మార్చి మార్చి చూస్తోంది. భర్త పరిస్థితిని గురించి ఆమె చాలా దిగులుపడుతోంది. ఆమెకి కూడా గురురాజన్ మాటలే మేధలో సుడితిరుగుతున్నై. ఆయనన్నాడు 'ఎక్కడ చూసినా రోగమొకటీ, వైద్యమొకటీ!' అని.

ఇప్పుడు కృష్ణమూర్తి విషయంలోనూ జరిగిందిదే!

ఇరవై రోజుల క్రితం - ఆదివారం సాయంత్రం-

పిక్కలు పట్టేసినాయంటూ గిలగిల్లాడుతూ కూలబడిపోయాడు కృష్ణమూర్తి. గోపాలం ఇంట్లోనే వున్నాడు. అతని భార్య సుజన. పిలలిద్దరు -అంజలి, అవినాష్

ఆడుకుంటున్నారు. కృష్ణమూర్తి తన మిత్రుడు హోమియో డాక్టర్ శర్మగారికి ఫోన్ చేసి ముందుకనుక్కోమంటే, నిప్పు తొక్కిన కోతిలా చిందులేశాడు గోపాల్. 'ఆ పంచదార మాత్రలకి జబ్బులు తగ్గవయ్యా మగడా అంటే వినరేం. మోస్ట్ అన్ సైంటిఫిక్ సిస్టం" అని హాస్పటల్‌కి తీసుకుపోతాను పదమని బయల్దేరదీశాడు. అంబులెన్స్‌లో వచ్చారు. పంజాగుట్ట నుంచి సోమాజీగూడా. దగ్గరే. ఓపీలో కుదరదని నసిగి, ఇన్సూరెన్స్ ఉందా, అని వివరాలడిగి - అడ్మిట్ చేయమన్నారు. కృష్ణమూర్తికి లక్షా అరవైవేలకి హెల్త్ ఇన్సూరెన్స్ వున్నది. అక్కణ్ణుంచీ కాలికేస్తే వేలికీ, వేలికేస్తే కాలికీ అన్నట్లు సాగింది వైద్యం.

మూడోరోజు నుంచీ వాంతులూ విరేచనాలూ మొదలైనై ఆయనకి. 'ఇంగ్లీష్ మందులు పడవు మొర్రో' అని గోల ఆయన. గోపాల్‌కి విసుగూ, చిరాకూ, టెస్ట్‌ల మీద టెస్ట్‌లు. మర్నాటినుంచీ 104 డిగ్రీల జ్వరం, మరో రెండు రోజులకి అది తగ్గేసరికి, పగలూ రాత్రీ దగ్గూ, ఆయాసం, కళ్లె. సాయంత్రాలు లోఫీవర్. వొళ్లంతా చెమటలు, నీరసం. ఆ పరిస్థితే ఇవాల్టికి కొంచెం హెచ్చుతగ్గులతో సాగుతోంది.

ఇవ్వాళ ఉదయం హాస్పటల్ ఎండీ డాక్టర్ మిశ్రా వచ్చారు. కృష్ణమూర్తిని పరీక్షించాడు. "ఛెస్ట్ ఇన్‌ఫెక్షన్ ఎక్కువగా ఉంది. ఫర్వాలేదు తగ్గిపోతుంది" అని భరోసా ఇచ్చి కదిలాడు. వెళ్తూ వెళ్తూ గోపాల్‌నీ, రామలక్ష్మినీ రూమ్ బయటకి పిలిచి 'టీ.బీ. కనిపిస్తోంది. కానీండి. సర్దుకుంటుంది' అని వెళ్ళిపోయాడు.

డాక్టర్ చెప్పిన మాటలకి ఒంట్లో ఓపికంతా నీరు కారినట్లైంది. మనసు పరిపరి ఆలోచనల్లోకి దిగింది. కానీ పళ్ళ బిగువున దుశ్శంకల్ని ఆపుకుంది.

గోపాల్‌కీ దిగులు కలిగింది. ఉన్నట్టుండి ఏదో అపరాధ భావనా హృదయాన్ని కలిచింది. వెంటనే తనను తాను సమాధానపరచుకున్నాడు. సకృత్తుగా జరిగే ఇలాటి సంఘటనలు ఎప్పుడూ వుంటాయి. అందుకని వైద్యం మానేస్తామా అనీ అనుకున్నాడు. 'ప్చ్' అని తలవిదిలించుకున్నాడు.

భార్యగానీ, కొడుకుగానీ ఈ సంగతిని కృష్ణమూర్తికి చెప్పలేదు.

"నువ్వెళ్ళు ఇంక. నాన్నగారికి బ్రేక్‌ఫాస్ట్ అయింది గదా. సుజనకి ఫోన్ చెయ్యి. తనను తిని మాకు భోజనం తెమ్మను' అన్నది రామలక్ష్మి గోపాల్‌ని ఉద్దేశించి.

మాటల్లోనే వచ్చాడు శ్రీనాథ్. కృష్ణమూర్తి రెండో కొడుకు. అతని వెనగ్గా అతని భార్య శ్రీవిద్య కూడా రూమ్‌లోకొచ్చింది. ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు. నివాసం మాదాపూర్‌లో. పిల్లల్లేరు. 'వాళ్ల ప్లానింగ్ వాళ్ళది. మనం చెపితే వింటారా?' అంటుంది రామలక్ష్మి. వాళ్ళిద్దరికీ ఇవాళా రేపూ సెలవు.

'ఎలా వున్నారు?' తో మాట కలిపారు. అటెండెంట్ బెడ్‌మీద శ్రీవిద్య. స్టూల్‌మీద శ్రీనాథ్ కూర్చున్నారు.

"వెంకటేశ్వరస్వామి దేవయాలయానికీ, శివాలయానికీ వెళ్ళివస్తున్నాం. శివాలయం అర్చకులు మంచి ఉపాసనా పరులు, చాలా ప్రభావం కలిగిన మంత్ర శాస్త్రవేత్తలు. మామయ్యగారికి విభూతీ, కుంకుమా ఇచ్చారు" అని బ్యాగ్‌లోంచీ రెండు పొట్లాలు తీసి అత్తగారి కిచ్చింది శ్రీవిద్య. "పక్కన వుంచండి. రేపు ఉదయం స్నానం అయిన తర్వాత పెట్టుమన్నారు. కాఫీ బ్రేక్‌ఫాస్ట్‌లకి ముందు" అనీ అన్నది. రామలక్ష్మి వాటిని తీసుకుని పక్కన కేబినెట్‌లో పెట్టింది.

మరదలివైపు చాలా అసహనంగా చూశాడు గోపాల్.

అన్న ముఖంలో చిరచిరా, చిరాకూ చూసి అన్నాడు శ్రీనాథ్– "అన్నయ్య కివన్నీ నచ్చవు గానీ, ఏదో – మా నమ్మకాలు మావి" అని సన్నగా నవ్వాడు.

"అవున్రా. అంతా బంకమ్. నాకు నచ్చదు" అని లేచి "నే వస్తానమ్మా" అంటూ విసురుగా బయటికి వెళ్ళిపోయాడు.

"ఎలా వుంది?" అని తండ్రిని పరామర్శించాడు శ్రీనాథ్.

ఆయన చిరునవ్వుతో "గాడ్ ఈజ్ గ్రేట్" అని గాల్లోకి దణ్ణం పెట్టారు.

"ఇదిగో ఇట్టాంటి మాటలతోనే మీ అన్నతో పేచీరా శ్రీనాథ్. వాడి తత్వం వేరు. స్వభావం వేరు. దేవుడూ భక్తీ అంటే రెచ్చిపోతాడు. పూజలూ, పునస్కారాలూ అంతా బంకమ్ అంటాడు తెలుసుగా. నిన్న సాయంత్రం కూడా వీళ్ళిద్దరూ ఘర్షణ పడ్డారు." రామలక్ష్మి

"ఏమైందీ!"

"ఆఁ ఏం చెప్తాం. గోపూజమీదా, ఆరాధనమీదా వ్యంగ్యంగా హేళన చేస్తూ... ఏదో పత్రికలో వ్యాసం రాశాట్ట గోపాల్. 'అతి తెలివితో కుంటి ప్రశ్నలు వేస్తాడు వెధవ' అని ఈయనకి కోపం. వద్దంటే ఊరుకోరు. నా కడుపు

రగిలి పోతుంది అని ఉద్రేకపడతారు. పురాణ పురుషుల్లో వారూ వీరూ గోమాంసభక్షణ చేశారు కదా అనీ, గోమూత్ర సేవనం ఛండాలమనీ ఏమేమో రాశాట్ట వాడు. వాడేమో – బోకరించటం కాదు, నా ప్రశ్నలకు సమాధానం చెప్పమని రెట్టించడం, మీ నాన్నగారేమో, ముందు ఫలానా ఫలానా పెద్దల్ని కలిసీ, ఫలానా గ్రంథాలు చదవమనీ సలహా. వాడు – అఖ్ఖర్లేదు, నాకు తెలుసులే అంటాడు. మీ నాన్నగారేమో – పొగరు, మూర్ఖపు శుంఠ అని తిట్టడం. మధ్యలో వినలేక నే ఛస్తున్నా" అన్నది రామలక్ష్మి.

శ్రీనాథ్, శ్రీవిద్యా ఒకరి మొహాలొకరు చూసుకున్నారు. అప్పుడు కృష్ణమూర్తి వైపు చూశారు. మానసికంగా పెద్ద క్షోభనే అనుభవిస్తున్న ట్టున్నది ఆయన వాలకం. క్షణాల తర్వాత అన్నాడాయన "పత్రికల వాళ్ళకి సంచలనం కావాలి. అందుకని ఇట్టాంటి రాతలు చెల్లుతున్నై."

ఈ మాటకి కొనసాగింపుగా రామలక్ష్మి చెప్పింది. ఆ మధ్య జ్యోతిష్యం మీదా ఇట్టాగే ఏదో రాశాట్ట. ఈయన వాదనకి దిగారు. గ్రహణం సంగతేమిటిరా అని అడిగితే, అది ఖగోళశాస్త్రం అన్నాట్ట. ఏమిటో గోల. ఒకసారి బాబాల మీద దండెత్తుతాడు. ఒకసారి మంత్రాలూ, విభూతీ వైద్యాలమీద విరుచుకుపడతాడు." పైటచెంగుతో మొహం, మెడా తుడుచుకుంది. శ్రీనాథ్‌కి సైగ చేస్తూ రూమ్ బయటకి నడిచింది. అతనూ ఆమెని అనుసరించాడు. వారిద్దరి వెనగ్గా శ్రీవిద్య కూడా వచ్చింది.

ఉదయం డాక్టర్ చెప్పిన సంగతంతా కొడుక్కీ కోడలికీ చెప్పింది రామలక్ష్మి. ముగ్గురూ దిగులు కళ్ళతో నిలబడ్డారు.

ఇంతలో ఫోన్ మోగింది. రామలక్ష్మి సెల్ మాట్లాడింది. మధ్యలో 'పిల్లకి అంతహైఫీవరెట్టావచ్చిందే' అని బాధపడింది. 'సరే నువ్ రాకు. శ్రీనాథ్ శ్రీవిద్యా వచ్చారు. వాళ్లు వచ్చి తెస్తార్లే మా భోజనం' అన్నది.

విషయం అర్థమైంది. అంజలికి నూటనాలుగు జ్వరం. ఆయాకిచ్చి పంపారు. అవినాష్‌నీ పంపారు. "మీరు వెళ్ళి చూడండిరా." అంటూ రూమ్‌లో కొచ్చింది. భర్తకీ చెప్పిందీ విషయం. 'సీజన్ మారిందిగా. అన్నీ వైరల్ ఫీవర్స్' అన్నాడాయన.

ఆ తర్వాత కొద్దిసేపటికే శ్రీనాథ్ శ్రీవిద్యా ఇంటికి వెళ్లారు. పంజాగుట్టలో శ్రీనాథ్ తల్లిదండ్రులూ, అన్నావదినా, ఆరేళ్ళ అంజలీ, మూడేళ్ళ అవినాష్ వుంటారు.

ఆ యిల్లు కృష్ణమూర్తి సొంతిల్లు. గోపాల్ ప్రైవేట్ కంపెనీలో ఎకౌంటెంట్. సుజన గృహిణి.

❖ ❖ ❖

ఆ సాయంత్రానికి కృష్ణమూర్తి పరిస్థితి హఠాత్తుగా దిగజారింది. బెడ్‌మీద లేచి కూర్చోలేక పోయాడు. ఎంత ప్రయత్నించినా ఆయన వల్ల కాలేదు. రామలక్ష్మి ఒక్కతే అక్కడ ఉంది. ఆమెకు గుండె గుభిల్లుమంది. కంగారు కంగారుగా డాక్టర్‌ని రప్పించింది. ఆయన వచ్చి చూసి ఇంజెక్షనిచ్చి స్పెషలిస్ట్ న్యూరాలజిస్ట్‌ని పిలిపించాడు. రామలక్ష్మి కొడుకులకి ఫోన్ చేసింది.

వీళ్లు వచ్చేసరికీ, ఆ స్పెషలిస్టూ వచ్చాడు. కృష్ణమూర్తిని పరీక్షించి ఐసియుకి మార్పించాడు.

రెప్పల కింద ఆందోళనతో రూమ్‌లో కూర్చుండి పోయారు. తల్లీకొడుకులు.

ఆదివారం, సోమవారం ఐసియులోనే ట్రీట్‌మెంట్. మంగళవారం సాయంత్రం రూమ్‌కి తీసుకువచ్చారు కృష్ణమూర్తిని. ఆయన పరిస్థితిలో మార్పులేదు. మల్టిపుల్ స్క్లెరోసిస్ అని రోగం పేరు చెప్పారు డాక్టర్లు.

బుధవారం తన రోగం పరిస్థితి తనకు తెలిసింది కృష్ణమూర్తికి. ఆయన స్థిత ప్రజ్ఞుడిలా 'కానీండి' అన్నాడు భార్య నుద్దేశించి. రామలక్ష్మికి కళ్ళనీళ్ళు తిరిగినై. మొహం పక్కకు తిప్పుకుని రూమ్ బయటకు వచ్చింది. దుఃఖం పొంగుకొచ్చింది. ఏడ్చేసింది. కొడుకులిద్దరూ కళవళ పడ్డారు. "అసలీ అడ్మిషనే ఇంత దూరం తెచ్చింది. డాక్టరే తమ పొరపాటున్నట్టు సూచించాడు కదా" అన్నాడు శ్రీనాథ్. గోపాల్‌కి మనసు చివుక్కుమంది. రూమ్‌లోనే ఘర్షణ పడ్డారు. విబూదీ కుంకుమల్ని గురించి గోపాల్ ఎత్తిపొడిచాడు. రామలక్ష్మికి హఠాత్తుగా వాటి సంగతి అప్పుడు గుర్తుకొచ్చింది. అవి ఎక్కడో కలిసిపోయాయి.

రామలక్ష్మే కొడుకుల్ని శాంతింప చేయాల్సి వచ్చింది. కోపం కొద్దీ, చిరాకుమీద "మీరేం ఒరగబెట్టుకుంటారో ఒరగబెట్టుకోండి". పోయి మంత్రాలూ జపాలూ, పూజలూ చేయించుకు చావండి" అని తిట్టాడు.

గదిలో మిగిలిన ముగ్గురూ నిశ్చేష్టులయ్యారు.

❖ ❖ ❖

గురువారం నాడు తానే బలవంతం చేసి హాస్పటల్ నుంచీ డిశ్చార్జ్ అయ్యాడు కృష్ణమూర్తి.

అంజలికి జ్వరం ఇంకా తగ్గలేదు. ఫ్యామిలీ డాక్టర్ శోభ నుంచీ చిల్డ్రన్స్ స్పెషలిస్ట్ డాక్టర్ బిక్షపతి దగ్గరికి మారింది వైద్యం. హాస్పటల్‌లో చేరుద్దామంటాడు గోపాల్. సుజనకి యిష్టం లేదు. “మామయ్య గారి వైద్యం చూశాం గదా. అక్కర్లేని స్ట్రాంగ్ మెడిసిన్స్ వాడి కొత్త రోగాన్ని తెప్పించి పూర్తిగా మంచం పాలు చేశారు. నా పిల్లని వాళ్ళ చేతుల్లో పెట్టను” అని నిష్కర్షగా చెప్పి ఏడుస్తోందామె. గోపాల్ సుజనా పాటికి పదిసార్లు ఈ విషయమై ఘర్షణ పడుతూనే వున్నారు.

సాయంత్రం ఆరు గంటలయింది. కుటుంబ సభ్యులంతా ఇంట్లోనే వున్నారు. శ్రీనాథ్, శ్రీవిద్య కూడా సెలవు పెట్టి ఇక్కడే వుంటున్నారు.

పక్కగదిలోంచీ అంజలి మూలుగుతోంది. మూసిన కన్ను తెరవటం లేదు. జ్వరం నూట రెండు డిగ్రీలకి అటూ ఇటూగా ఉంటోంది. కృష్ణమూర్తికి పరిస్థితి అర్థం అవుతోంది. రామలక్ష్మి ఆయన గదిలోకీ, అంజలి వున్న గదిలోకీ కాలుగాలిన పిల్లిలా తిరుగుతోంది. హోమియో డాక్టర్ శర్మగారికి ఫోన్ చేశాడాయన. ఎవరినన్నా పంపితే వెంటనే వస్తానన్నాడాయన. గోపాల్ ప్రమేయం లేకుండా శ్రీనాథ్ కారులో ఆయన్ని తీసుకురావడానికి వెళ్ళాడు.

గోపాల్ పళ్ళు కొరుక్కుంటూ, భార్యమీద, తండ్రి మీద కారాలూ మిరియాలూ నూరుతూ హాల్లో ఒక ప్రక్కగా కూర్చుని ఉన్నాడు.

శర్మగారు వచ్చారు. పిల్లని పరీక్ష చేశారు. వివరాల్ని అడిగారు. రామలక్ష్మి, సుజనా అన్నీ విశదంగా చెప్పారు. అంజలి రెప్పలు తెరిచి చూశాడాయన. ‘అమ్మా’ అని ఠక్కున కళ్లు మూసుకుంది పిల్ల. ‘ఆహారం ఏమిస్తున్నారు?” అడిగాడు. “డాక్టర్‌గారు అన్నం పెట్టొచ్చన్నారు. అందుకని అంతో ఇంతో అన్నరసమే పడుతున్నాం” చెప్పింది సుజన. “మోషన్ అవుతోందా?” కావటం లేదు. ఆరు రోజులైంది” “ఈ జ్వరానికి ముందు పిల్ల వర్షంలో తడిసిందా?” అత్తాకోడలు ఒకరినొకరు ప్రశ్నించుకున్నారు. అప్పుడు చెప్పింది సుజన. “అవును కిందటి గురువారం బస్ రావటం ఆలస్యమైతే – బాగానే తడిసింది వర్షంలో”. “అవినాష్ వెళ్ళలేదా రోజు” అని తనకు తాను చెప్పుకుంది.

శర్మగారు లేచి హాల్లో కొచ్చారు. "ఈ రెండు డోస్‌లూ - ఒకటి యిప్పుడు వేయండి. రెండోది రాత్రి తొమ్మిదింటికి వేయండి" అని మందుని పొట్లాలు కట్టిచ్చాడు. "అంత జ్వరం మీద రోజూ అన్నం పెడితే విషమవుతుందమ్మా. తెలిసీ తెలియని పరిస్థితి. దానికి తోడు మోషన్ లేదు" అన్నాడు యథాలాపంగా.

కృష్ణమూర్తి గదిలోకి వెళ్ళి పరామర్శించాడు. ఆయనేదో చెప్పబోతుంటే, 'మీ కేస్‌ని వివరంగా చూడాలి. టైమ్ పడుతుంది. ఇప్పుడు కాదు' అని సెలవు తీసుకుని వెళ్ళిపోయాడు. అంజలికి మొదటి డోస్ వేసింది సుజన.

పిల్లని గురించి శర్మగారన్నమాటలు సుజన మనస్సులో మరింత దిగులు రేపినై. కళ్ళల్లో నీళ్ళుబికినై. భర్త వైపు చూసింది. ఆమె కళ్ళతో చూపులు కలుపలేక ఎటో చూశాడు గోపాల్. "నే చెబుతూనే వున్నాను. మొన్ననే ఈయన్ని పిలుచుకురండి మహానుభావా అని. వింటేగా. ఏమన్నా నా మీద గయ్యన లేస్తారు" అంటూ నిష్ఠూరమాడింది. రామలక్ష్మి ఏమో మాట కలిపింది.

గోపాల్‌కీ కోపంగా వుంది. కాళ్ళు తాటిస్తూ లేచి బయటకి నడిచాడు.

- రాత్రి ఎనిమిదవుతుంటే సుజన అత్తగారితో అన్నది."మీ పురాణం ఫ్రెండ్ శారదమ్మగారు మంత్రించిన విభూతి యిస్తారుగదా, మందుకు తోడు, అదీ పెట్టిస్తే బాగుంటుందేమో"

గోపాలం విన్నాడు. 'ఇదో బుద్ధిలేని పని. గుడ్డి నమ్మకాలూ, చెత్త పనులూ" అని ఒంటికాలిమీద లేచాడు.

సుజన ఆ గద్దింపుకు అదిరిపోయింది. అయినా నసిగింది "చెత్తపనో మంచిపనో- దాన్లో నష్టమేముంది?" అని.

'అదీ అసలు ఏడుపు. మనకు -ఫ్రీగా వస్తే చాలు. నష్టం లేదు కనుక అన్నీ తెచ్చుకుని పులుముకుంటాం"

శ్రీనాథ్‌కి నవ్వొచ్చింది. "ఫ్రీగా రావటం కాదన్నయ్యా. ఇక్కడ ప్రధానాంశం. - విశ్వాసం. మనుషులు కొన్ని విశ్వాసాల ఆధారచక్రం మీద నిలబడి బతుకుతూ వుంటారు. మనం సంసారాలు చేస్తున్నదీ ఆ విశ్వాసం ఊపిరి పీలుస్తూనే". అని క్షణం ఆగి మళ్ళీ అన్నాడు, "ఒక్కసారి ఆలోచించు. గోవు గురించీ, బాబాల గురించీ, పూజలూ మంత్రాలూ జపాల గురించీ నీ విశ్వాసం- 'బంకమ్' అని.

హోమియో నీకు శాస్త్రీయం కాదు. నాన్నగారితో సహా ప్రపంచమంతా దాన్ని వాడుతున్నారు. అలాగే అమ్మకి పూజా,జపాలూ, మీ మరదలికి మంత్రాలూ, వదినకి విభూతీ! నమ్మకం మీద సాగే పనులు తర్కానికి లొంగవు. నువ్వు పాటికి పదిసార్లు అనే 'శాస్త్రీయ' విశ్లేషణకీ 'బేసెస్' ఏవో చెబుతావు కదా. వాటినీ నీ విశ్వాసం మీద నీవూ, నీలాంటి కొందరూ నిర్దేశించుకున్నప్పుడు నేనెందుకు నమ్మితీరాలి?"

హాలంతా నిశ్శబ్దంలోకి జారుకుంది. గోపాల్ తలవంచుకుని తనలో తాను ఏదో గొణుక్కోసాగాడు.

క్షణం తర్వాత నెమ్మదిగా మళ్ళీ శ్రీనాథే అన్నాడు. "అందుకనే మనుషులు ఏం చెయ్యాలనుకుంటారో అది చేస్తారనే సిద్ధాంతం చెప్పి జోక్ చేస్తున్నారిటీవల!" అని. "మళ్ళీ ఈ సిద్ధాంతం 'వేలిడిటీ', 'వెరాసిటి' కూడా ప్రశ్నార్థకమే!" అని నవ్వేశాడు.

"నీదో పిడి వాదం" అని లేచి తన గదిలోకి వెళ్ళాడు గోపాల్. సుజన కూడా అతన్ని అనుసరించింది.

అంజలి పక్కమీద ఆ వైపుకి కదిలింది. దగ్గరగా వెళ్ళి మంచం మీదకి వంగి, "ఏరా- నాన్నా" అన్నాడు సౌమ్యంగా. "ఊఁ" అని దీర్ఘం తీసి వూరుకుంది పిల్ల. కళ్లు మూసుకునే వుంది. నుదిటిమీద చేయివేసి చూశాడు. జ్వరం జ్వరంగానేవుంది. గోపాల్ మనసు వికలమైంది.

–రాత్రి టిఫిన్‌లు కానిచ్చారు. మళ్ళీ గదిలోకి వెళ్ళి పిల్ల మంచం పక్కన కూర్చున్నాడు గోపాల్. సుజన వచ్చింది. భర్తవైపు పరీక్షగా చూసింది. అతని మొహంలో ఆందోళన. కళ్ళల్లో ఆవేదన. చేతులు కదిలించటంలో అలజడి! ఆమెకు బాధ కలిగింది. దగ్గరగా వెళ్ళి భుజం మీద చేయివేసింది. గోపాల్ కళ్లల్లో నీరు ఉబికింది. నిబ్బరించుకున్నాడు. "ఫర్వాలేదు అంతా సర్దుకుంటుంది" అన్నది ఆర్ద్రంగా, ఆదరంగా, ఆమెకీ కంఠం రుద్ధమైంది.

చాలాసేపు గడిచింది. గోపాల్ కుర్చీలోంచి లేచి మళ్ళీ పిల్ల వొళ్ళు చూశాడు. జ్వరమేమీ తగ్గలేదు. గోపాలం కదిలి హాల్లో కొచ్చాడు. పచార్లు చేయసాగాడు. తమ్ముడి మాటలు పదే పదే తలపుకొస్తున్నయ్. 'నమ్మకం మీద సాగే పనులు ఏ తర్కానికీ లొంగవు" గతంలోనూ శ్రీనాథ్ ఓ సారి అన్నాడు, "ఎదుటి మనిషిని

దోచుకోనంతకాలం, ఏ హానీ తలపెట్టనంత కాలం - ఇతరులకున్న నమ్మకాలతో మనకేం నష్టం?" అని.

గోపాల్‌కి తోచీ తోచని స్థితిగా వుంది. పిల్ల దగ్గర కూచుని ఆందోళన పడుతోంది సుజన. ఇప్పుడామె పక్కన అత్త, శ్రీవిద్య కూడా ఉన్నారు. అన్యమనస్కంగా బయటకు వెళ్ళిపోయాడు గోపాల్. శ్రీనాథ్‌తో సహా అందరూ చూస్తుండిపోయారు.

అర్ధగంటకి తిరిగి వచ్చాడు. భార్య దగ్గరసా వెళ్ళాడు. ఆమె ఒక్కతే వుంది పిల్ల దగ్గర. జేబులోనుంచి పొట్లం తీసి సుజన చేతిలో వుంచాడు. ఆమె మొహంలో ఆశ్చర్యమూ, తొట్రుపాటూ.

వారిద్దరి మధ్యా మాటలు శూన్యమైనాయి!

మర్నాడు - ఉదయం ఆరింటికే కళ్లు తెరిచింది అంజలి. "నాకు ఆకలవుతోందే అమ్మా!" అని పిలిచింది. జ్వరం లేదు!

ఎవరెవరు ఏఏ పాఠాలు నేర్చుకున్నారో? -బతుకుగీతని అడగాలి!!!

**(జాగృతి 20.1.2014)**